

# మానభంగం

“అరెయరయ్! ఇట్రారా!”

“ఏంద్రా...ఏంద్రా? ఏంది బె!”

“అగ సూడు. అగ సూడు. అటు సూడ్రా!”

“ఏట్రా... ఏట్రా? ఏం గన్పిస్త లేదు గదా...”

“ప్స్! బాగ చూడు బె. ఇగో—ఇగో ఆ సెయ్యికి సూటిగ జూడు.”

“ఏముంద్రక్కడ? ఏం లేదు గదా! ?”

“ప్చ్.. మంచిగ జూడుబె.అడ...అడ... మన గుడి సివతల కొనాకున్న గుడిసె కన్పిస్త లేదు?”

“అవావ్ కనిపిస్తుంది.”

“ఆ గుడిసె పక్కన కందిపొరకతోని గట్టిన దడి గన్పిస్త లేదు.”

“ఆఁ—ఆఁ—కనిపిస్తుంది.”

“దాని మీద బట్టలు కన్పిస్త లేవు! ?”

“అవావ్! కనిపిస్తున్నయి. ఓ సీరె, రైకె...”

పక్కున నవ్వాడు సెంద్రిగాడు!

సెంద్రిగాడు అక్కడే ఉంటాడు. ఆ కన్పించే గుడిసె కాక, అవతలి రెండు గుడిసెల ముందరున్నది వాడి గుడిసె. వీడి గుడిసె అవతల మరో రెండు గుడిసె లున్నాయి.

చుట్టూ అడివి—ఈ మధ్యే ఒక్క భూస్వామి ఆ అడివిలోని కొంత భూమిని

మాచన్న
సంజీవరెడ్డి

సాగులోకి తెస్తున్నాడు. అందుకే ఆ గుడిసెలూ, ఆ గుడిసెల్లో జనమూ!

సెంద్రిగానికి తల్లీ, తండ్రీ చిన్నప్పుడే పోయారు. పినతల్లి దగ్గిర పెరిగిన సెంద్రిగాడు రెక్క లొచ్చాక ఆమెను కూడా తన్ని పారేశాడు.

ఇప్పుడొక్కడే. పెళ్ళి కాలేదు. గుడిసె వాని సొంతం. అక్కడున్న మిగతా గుడిసెలుకూడా వాని సొంతం లానే అనుకుంటాడు.

వాడంటే అక్కడ కొందరికి భయముంది. మరి కొందరికి భక్తీ ఉంది. ఇంకొందరికి ఏదీ లేదు.

“ఏంద్రా గట్ల నవ్వుతవు?” ఆశ్చర్యంగా అడిగాడు పక్కనున్న ఆసిగాడు.

“ఆ సీరె రైకెవరివియో దెలుసా?”

“దెల్వదు.”

“తెల్సుకోవాలని లేదా?”

“లేదు!” ఆసిగాడికి కోప మొచ్చింది—సెంద్రిగాడు ఆట్ల పూరించడం.

ఆసిగాడు సెంద్రిగాని దోస్త్.

పోయిన సంవత్సరం ఇక్కడ కూలి దొరకక నిజాంబాదు వెళ్ళాడు సెంద్రిగాడు. అక్కడ పరిచయ మయ్యాడు ఆసిగాడు.

ఆసిగాడి పుట్టినూరు నిజామాబాదు కాదట. ఇక్కడికి దగ్గర్లోని మరో పూరేనట. తలి దండ్రులు పోయారట. సెంద్రిగాడు పరిచయం కాగానే తన సంగతంతా వివరించాడు ఆసిగాడు.

సెంద్రిగానికి సంతోష మనిపించింది. ఆసిగాని క్కూడా సంతోషమే అనిపించింది—తా మిద్దరూ ఒకే ప్రాంతం వాళ్ళు కావడంతో.

పంటల కోత లయిపోగానే మళ్ళీ ఇక్కడి కొచ్చేశారు వాళ్ళిద్దరూ.

ఇప్పుడు ఆసిగాడుకూడా సెంద్రిగాడి గుడిసెలోనే ఉంటున్నాడు.

సెంద్రిగాడు, ఆసిగాడు కలిసి దేని మీదైనా కన్ను వేశారంటే అంతే ఇక!

మొక్కజొన్నైనా, జొన్నైనా, వేరుసెనగైనా, సెనగైనా వాళ్ళ కంట్లో పడితే కరిగి పోవాల్సిందే! అంతటి ఘను లన్న మాట.

వాళ్ళను పట్టుకోవడం బ్రహ్మతరం కూడా కాదు.

అదృష్టవశాత్తు పొరపాటునకూడా ఇంతవరకూ ఏ అమ్మాయి వాళ్ళ కంట్లో పళ్ళేను కాని మొన్నీ మధ్యే ఎట్లాలు వాళ్ళ కంట్లో కొచ్చింది. ఆసిగాడు పిచ్చి పిచ్చి వేషా లెయ్యబోతే అందరూ చూస్తుండగానే ఎట్లాలు చాచి లెంప కాయ కొట్టింది.

